నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 19 ఏప్రిల్ 2023

మసీద్ అభివృద్ధికి నిధులు మంజూరు



నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో గల మసీదు అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చేతుల మీదుగా మైనార్టీలకు చెక్కును అందజేశారు. మసీదు అభివృద్ధి కోసం రూ.3 లక్షల 96,892 మంజూరు అయ్యాయని, ఈ నిధులతో మసీదును అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతరెడ్డి, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ రామచంద్రం, పట్టణ మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, పట్టణ మైనార్టీ సెల్ నాయకులు సిరాజ్ ఉద్దీన్, సర్దార్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి స్వాగతం పలికిన జిల్లా అధికారులు



నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీకి కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. హోంమంత్రి మహమూద్ అలీకి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా నిర్మల్‌కు రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ వెళ్లారు.

సమస్యలు పరిష్కరించేనా..?

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నేడు (బుధవారం) నిర్వహించనున్నారు. అయితే గతేడాది డిసెంబర్ 28న అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్న సయమంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఆ సమావేశంలో లేవనెత్తిన పలు సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అయితే నిజామాబాద్‌కు కొత్తగా వచ్చిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్ ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని మొదటిసారిగా నేడు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గత సమస్యలు, ప్రస్తుత సమస్యలపై చర్చించి పరిష్కారం చూపేనా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గత కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ పాల్గొన్నారు. అయితే జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌కు ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన ఫోన్‌నెంబర్‌ను వాడాలని జెడ్పీ చైర్మెన్ విఠల్‌రావు సూచించారు. అయినప్పటికీ సూపరింటెండెంట్ ఆ నెంబర్‌ను వాడడం లేదు. ఆమెకు అధికారికంగా కేటాయించిన ఆ నెంబర్‌ను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ ఉద్యోగి వాడుతుండటం గమనార్హం. ఇదిలా ఉండగా.. అధికారికంగా కేటాయించిన నెంబర్‌ను సూపరింటెండెంట్ వాడకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే ఏ నెంబర్‌కు చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. జిల్లా అధికారులు, క్యాబినెట్ హోదాలో గల ఓ ప్రజాప్రతినిధి చెప్పినా.. జీజీహెచ్ సూపరింటెండెంట్ పెడచెవిన పెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత కలెక్టర్ ఉన్న సమయంలోనే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 67 ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 31న 2022న ఆ పోస్టులకు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. అదే ఏఎన్ఎం ఔట్‌సోర్సింగ్ 67 పోస్టులకు సంబంధించిన మరో ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను ఏప్రిల్ 01న విడుదల చేశారు. ఇందులో 13 మంది అభ్యర్థుల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో రెండోసారి ఇచ్చిన మెరిట్ లిస్ట్‌లో తొలగించబడిన 13 మంది అభ్యర్థులు కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఆ పోస్టుల భర్తీ సైతం నిలిచిపోయింది. అయితే గత సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ డీఎంఅండ్‌హెచ్‌ఓపై వచ్చిన పలు ఫిర్యాదులపై అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డికి ఓ సారి విచారణ చేసి చూ డాలని సూచించా రు. అప్పుడే డీఎంఅండ్ హెచ్‌వోపై విచారణ చేసి ఉంటే ఏఎన్ఎం పోస్టుల భర్తీలో అవకత వకలు జరిగేందుకు ఆస్కారం ఉండేది కాదని అభ్యర్థుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యేనా..?

జెడ్పీ సమావేశానికి నిబంధనల ప్రకారం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరుకావాలి. కానీ ప్రతి సమావేశానికి సగానికి పైగా ప్రజాప్రతినిధులు డుమ్మా కొడుతున్నారు. సమావేశానికి హాజరై ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారం చూపించాల్సిన ప్రజాప్రతినిధులు జెడ్పీ సమావేశానికి హాజరుకాకపోవడం ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం..

నేడు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విచ్చేసి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

మహిళ ఆరోగ్య పథకం

అమలు కావాలి

- సమయపాలన పాటించాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా ఆరోగ్య రక్షణ పథకంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం ఉచితంగా ఆరోగ్య రక్షణ పథకం అమలు జరిగేలా చూడాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మంగళవారం బీర్కూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి సంబంధించిన ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ఆస్పత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై డాక్టర్ శ్రీలేఖను అడిగి తెలుసుకున్నారు. బీర్కూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ పథకం అమలుపై డాక్టర్ శ్రీలేఖను అడిగి తెలుసుకున్నారు. నేడు ఆరోగ్య మహిళ పథకం ద్వారా ఎందరు రోగులు వచ్చారని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకాన్ని పక్కగా అమలు జరిగేలా వైద్యులు చూడాలని, వచ్చి వెళ్లే వ్యాధిగ్రస్తులకు వైద్య ఆరోగ్య సిబ్బంది సహకరించి ఆరోగ్య మహిళా పథకం పక్కగా అమలు జరిగేలా చూడాలన్నారు.

ఆరోగ్య మహిళ దవాఖానాల్లో క్యాన్సర్, రక్తహీనత, గర్భసంచి, అధిక బరువు, పోషకాహార లోపం వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి 8 రకాల పరీక్ష లు పూర్తి ఉచితంగా నిర్వహించి, మందులు కూడా ఇస్తారని మంత్రి హరీశ్‌రావు చెప్పారని తెలిపారు. 80శాతం వ్యాధులకు మహిళా దవాఖానల్లోనే పరి ష్కారం లభిస్తుందని, ఇక్కడ నయం కాని పక్షంలో జిల్లా కేంద్రాల్లోని ప్రధాన దవాఖానలకు రెఫర్ చేస్తారని, అక్కడ ప్రత్యేకమైన హెల్ప్‌డెస్కులు, ఒక్కో విభాగానికి ఒక్కో కియోవార్డులు ఉంటాయని వివరించారు. జిల్లా దవాఖానల్లో అవసరమైన ఆపరేషన్లు చేయడంతోపాటు మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని భరోసా ఇచ్చారు. అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. వీరి వెంట బాన్సువాడ ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా ప్రోగ్రాం అధికారి శోభారాణి, ఎంపీడీవో భానుప్రకాష్, తహసీల్దార్ రాజు, డాక్టర్ శ్రీలేఖ, సీహెచ్ఓ రవీందర్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో ఘనంగా ఇఫ్తార్ విందు

- పాల్గొన్న ఆర్డీఓ, ఏసీపీ



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్

ముస్లింలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని జామా మసీదులో ప్రభుత్వం తరపున అధికారులు ఘనంగా ఇఫ్తార్ విందును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజేశ్వర్, ఏసీపీ కిరణ్ కుమార్ మైనారిటీ సోదరులకు ఫలాలు అందించి ఉపవాసం విరమించారు. అనంతరం ఆర్డీఓ రాజేశ్వర్, ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రంజాన్ పండగను పురస్కరించుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకోవాలని కోరుతూ వారికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయి, వైస్ చైర్మెన్ షకీల్, డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, రూరల్ సీఐ శ్రీనివాసరాజ్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్, సురేష్ పటేల్, ఎస్ఐ సందీప్ మైనారిటీ మత పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ఏఐకెఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం చెయ్యాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర కౌన్సిల్ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24, 25న జరుపుతున్నామని అధికసంఖ్యలో రైతులు, కూలీలు హాజరై విజవంతం చేయాలని వేల్పూర్ భూమయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో గౌరవ అధ్యక్షులు నాయక్‌వాడి నర్సయ్యతో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించడం మూలంగ వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. భారత వ్యవసాయరంగాన్ని బలిపీటంపై నిలపెడుతున్న పాలకుల విధానాలను తిప్పికొట్టేందుకు ఈ రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో చర్చించించడం జరుగు తుందని అన్నారు. అప్పుల సుడిగుండంలో చిక్కుకున్న రైతులను ఆదుకోవడంలో పాలకులు విఫలం అయ్యా రని అన్నారు. లక్షల కోట్ల రూపాయలు ఎగవేస్తు బ్యాంక్‌లను ముంచుతున్న వ్యాపారులపై ఉన్న ప్రేమ, దేశానికి అన్నం పెడుతున్న రైతులపై ఈ పాలకులకు లేదని అన్నారు. ఈ కౌన్సిల్ లో గతంలో నిర్వహించిన రైతంగా ఉద్యమలను సమీక్షించుకొని రాబోయే రోజుల్లో బలమైన రైతంగా ఉద్యమాలు ఉధృతం చేయడానికి తగిన కర్తవ్యాలను రూపొందించు కుంటామని అన్నారు. అందుకే రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేషేటి సాయరెడ్డి ఉపాధ్యక్షులు బి.సాయిలు, అగ్గు ఎర్రన్న, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ శివారులోని ఎంఎస్ఎన్ కెమికల్ పరిశ్రమలో మంగళవారం మొక్కలు నాటి, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ మన్నె సత్యనారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు కంపెనీ ఆవరణలో మొక్కలు నాటి, రక్తదానం, మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ టెస్టులు, డెంటల్ టెస్టులు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ బ్రహ్మానందరెడ్డి, శర్మ, కంపెనీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మంచి అలవాట్లవైపు ఆసక్తి చూపాలి

- హైకోర్టు సీనియర్ న్యాయవాది మోహిన్ అహ్మద్ ఖాద్రి
- పేద మైనార్టీ విద్యార్థులకు 65 సైకిళ్లు పంపిణీ
- లింగంపేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఖాద్రి

నవతెలంగాణ-లింగంపేట్

మైనార్టీ పేద విద్యార్థులు మంచి అలవాట్లవైపు ఆసక్తి చూపాలని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, భారీ నీటి పారుదల జలమండలి కమిటీ సభ్యులు మహమ్మద్ మోహిన్ అహ్మద్ ఖాద్రి అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఖాద్రీ ఫామ్‌హౌస్‌లో లింగంపేట్‌లోని పేద మైనార్టీ విద్యార్థులకు పిల్లలకు 65 మందికి తన సొంత డబ్బులతో సైకిలను అందజేశారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజల దప్పిక తీర్చడానికి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సాయంత్రం ఆయన ఫామ్ హౌస్‌లో పెద్ద మసీదులో రోజువారిగా నమాజ్ చేసే పిల్లలకు మైనార్టీ విద్యార్థులకు అదేవిధంగా బస్టాండ్ ప్రాంతంలోని కొత్త మస్జీద్ వెళ్లి నమాజ్ చేసే పిల్లలకు 65 మందికి ఆయన చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నస్థాయికి ఎదగాలని సూచించారు. లింగంపల్లి గ్రామానికి చెందిన బ్లాక్ బెల్ట్ కరాటే బాలునికి సన్మానించారు. అనంతరం ఉపవాస దీక్షలున్న మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ఖాద్రి కుమారులు ముఫీద్ ఖాద్రి, ముసీద్ ఖాద్రి, మదర్స నిర్వాహకులు హబుల్ హసన్ రిజ్వి, మజీద్ కమిటీ అధ్యక్షులు ఫారుఖ్, నజీర్దు ఖదీర, రియాజ్, సర్దార్ ఖాన్, కాసిఫ్, ప్రతి యుద్దీన్, నయీమ్, వహాబ్, ఇబ్రహీం, అంజా హుస్సేన్, యూసుఫ్, జమీల్, ఖయ్యూం, కుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జర్నలిస్టుకూ ఇండ్ల స్థలం ఇవ్వాలి

- టీడబ్ల్యూజేఎఫ్



సంతకాల సేకరణ చేపడుతున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని కామారెడ్డి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మార్కెట్ కార్యాలయం ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి జర్నలిస్టుకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 25, 26 తేదీలలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేత కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వము స్పందిం చకపోతే నిరసన దీక్షలు చేపడతామని అప్పటికి కూడా ప్రభుత్వము చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షలు సైతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విజయానంద్, జిల్లా అధ్యక్షుడు సిద్దాగౌడ్, ప్రధాన కార్యదర్శి వేణు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, కరుణాకర్, మోహన్, ప్రవీణ్ గౌడ్, జక్కుల సంతోష్ కుమార్, ప్రశాంత్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల కోసమే రీడింగ్ రూమ్

- అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



అదనపు కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ యువతీ యువకులు చదువుకోవడానికి రీడింగ్ రూమును ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం మండలంలోని మోతే గ్రామంలో పోటీ పరీక్షల కోసం విద్యార్థులు చదువుకోవడానికి భవనాన్ని పరిశీలించి ఏర్పాటు చేశారు. భవనంలో కుర్చీలు, టేబుల్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీటి వసతులు కల్పించాలని ఆయన సూచించారు. నిరుద్యోగులైన యువతీ యువకుల కోసం ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు పోటీ పరీక్షలకు సంబంధించినటువంటి పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. దాతల సహకారంతో రీడింగ్ రూమ్‌లో మరికొన్ని పుస్తకాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సర్పంచ్ రామ్‌రెడ్డి అదనపు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈయన వెంట ట్రైనింగ్ కలెక్టర్, ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, ఎంఈఓ రామస్వామి, ఎంపీఓ ప్రభాకర్ చారి, ఎంపీటీసీ సిద్ధి రాములు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



రంజాన్ కానుకలు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మైనార్టీలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, జడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్, పట్టణ సర్పంచ్ వేణు, బీఆర్ఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతురెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంతరెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయిరెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నేత గుండెపోటుతో మృతి

- అంత్యక్రియలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



నవతెలంగాణ-వర్ని

రుద్రూర్ మండలం బొప్పపూర్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నాన్ శంకర్ (49) మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. ఆయన అంత్యక్రియలను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా నాయకులు పెద్ది వెంకట్‌రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్ సీపీఐ(ఎం)లో 25 సంవత్సరాల పాటు పనిచేసి పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేశారని తెలిపారు. పేద ప్రజల సమస్యలపై పోరాటం చేశాడని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, నిరుపేదలకు భూములివ్వాలని పేద ప్రజలకు అండగా నిలబడిన కామ్రేడ్ అని పేర్కొన్నారు. ఆయన అంత్యక్రియల్లో ఉమ్మడి మండల సీపీఐ(ఎం) కార్యదర్శి నన్నేసాబ్, ఏశాల గంగాధర్, సూరి, బాలయ్య, సాయిబాబా, లక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలి



బోరును పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ.. పెద్ద మల్లారెడ్డి గ్రామ చెరువు కట్ట వద్ద కంచర్ల గ్రామస్తులు తాగునీటి కోసం బోరు తవ్వించగా ఇరు గ్రామాల మధ్య వాగ్వివాదం జరిగింది. విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళడంతో వెంటనే అట్టి బోరును అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ అక్కడికి వెళ్లి బోరును స్వాధీనం చేసుకుని, రెండు గ్రామాల ప్రజలు సామరస్యంతో ఉండాలని సూచించారు. తదుపరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చేవరకు బోరును ఎవరూ వాడ వద్దని ఆదేశించారు.

కంపోస్టు షెడ్లను వినియోగించాలి

- డీఆర్‌డీఏ చందర్ నాయక్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ

నవతెలంగాణ-మాక్లూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంపోస్టు సెడ్లు అసంఘటిత కార్యక్రమాలకు నిలయాలుగా మారాయని డి ఆర్ డి ఏ పిడి చందర్ నాయక్ అన్నారు. వాటిని ఉపయోగించి చెత్తను వేరు చేసి స్వచ్ఛతను పాటించాలని తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వచ్ఛభారత్ గ్రామీణ్ టు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విటల్ హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో తడి చెత్త పొడి చెత్త వేరు చెయ్యాలని, ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చందర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీలో మురుగునీటి నిర్వహణ సరైన క్రమంలో నిర్వహించుకోవాలి దీనికి సంబంధించి వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడానికి డంపింగ్ షెడ్ పూర్తిస్థాయిలో నిర్వహించుకోవాలని అన్నారు. కొత్తగా ఏర్పాటైన కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీ ఓ శ్రీనివాస్, శిక్షణ కార్యక్రమం ఇవ్వటానికి వచ్చినటువంటి మాస్టర్ ట్రైనర్స్ సంతోష్ కుమార్, సుభాష్ చంద్ర బోస్, అశోక్, రాజు, రాంబాబు, ఉపాధి హామీ ఏపీఓ ఓంకార్, ఐకెపి ఎపిఎం అనిల్ కుమార్, వివిధ గ్రామపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘం అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల వస్తువులు అందించాలి

నవతెలంగాణ-భీంగల్



రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు 12 రకాల వస్తువులను అందజేయాలని ప్రగతిశీల మహిళ సంఘం నాయకురాలు భాగ్య అన్నారు. మంగళవారం పట్టణకేంద్రంలోని నందిగల్లి, ఎస్సీ వాడలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ కార్డులేని వారిని గుర్తించి కార్డులను అందజేసి 12 రకాల వస్తువులను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ నాయకుడు రాజేశ్వర్, నాయకులు అరవింద్, యం అశోక్, సిహెచ్ రాజేశ్వర్, రాణి, సత్యగంగు, సునోచన, శ్రీపాద యమున, సత్తెమ్మ, సర్ధలత, లింభక్క తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హిమోఫిలియా వార్డు ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇమోఫిలియా ఓరోగులకోసం జీజీహెచ్‌లో ఇమోఫిలియా వార్డు ఏర్పాటు చేయడం జరిగిందని నిజామాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దాదన్నగారి విఠల్ జిల్లా పరిషత్ చైర్మన్ నిజామాబాద్, నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్ నగర మేయం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిజామాబాద్‌లో హిమోఫిలియా సొసైటీ ఆఫ్ నిజామాబాద్ సహకారంతో హిమోఫిలియా వార్డు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ ఆనంద్ రావు హిమోఫిలియా సొసైటీ ప్రెసిడెంట్, సంతోష్ కుమార్ అసిస్టెంట్ డైరెక్టర్ జిజిహెచ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెంబర్ 9849234696

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఓపెన్ ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 25 నుండి మే 04 వరకు ఎస్ ఎస్ సి, ఇంటర్ ఓపెన్ ఎగ్జామ్స్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుండి 5:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. మొత్తం 3359 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. వీరి కోసం నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బస్టాండ్లలో విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్-డెస్కులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలోనూ నెలకొల్పిన కంట్రోల్ రూమ్ నెంబర్ : 9849234696 ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. ఇటీవల పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా ఇతర ప్రాంతాల్లో పలుచోట్ల జరిగిన లోటుపాట్లు ఓపెన్ పరీక్షల్లో పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీసు బందోబస్తు మధ్యన నిర్ణీత సమయానికి ప్రశ్నపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరాలన్నారు. ఆకస్మిక తనిఖీల కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని, ప్రతి కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్లు ఉండాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించి పరీక్షల నిర్వహణ విధుల గురించి శిక్షణ ఇవ్వాలన్నారు. పరీక్ష ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షకేంద్రాల్లో తాగునీటి వసతి ఉండేలా తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక చికిత్సకోసం ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఎం లను ఎగ్జామ్ సెంటర్లలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగా పరీక్షలు జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ జి.మధుసూదన్ రావు, ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల జిల్లా సమన్వయకర్త రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



హాజరైన అధికారులు

గుండెపోటుతో వీఆర్ఏ మృతి

ప్రభుత్వ హామీలు అమలుకావడంలేదనే మనోవేదనతోనే

నవతెలంగాణ-మాక్లూర్



ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంవల్ల మనస్థాపంతో గుండెపోటు వచ్చి ఓవీఆర్ఏ మృతిచెందాడు. ఈఘటలన మండలంలోని అమ్రాద్‌లో చోటుచేసుకుంది. ఆమ్రాద్ గ్రామానికి చెందిన సుంకరి విఠల్ (46) వీఆర్ఏ గుండె పోటుతో మృతి చెందినట్లు విఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు గైని దయాసాగర్ తెలిపారు. పే స్కేల్, ప్రమోషన్‌లు వస్తాయని, జీవితాలు మారుతాయని ఆశించి, ప్రతి రోజు ఆలోచిస్తూ మనోవేదనకు గురయ్యేవాడన్నారు. ఈక్రమంలో మంగళవారం గుండె పోటువచ్చి మరణించారని తెలిపారు. 80రోజుల సమ్మెలో చురుకుగా పాల్గొన్నారని, సమ్మె కాలం జీతం రాకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్థాపానికి లోనయ్యారన్నారు. అంత్యక్రియల్లో మండల విఆర్ఏలు, మండల నాయకులు సంతోష్, సిలార్, రాజేశ్వర్, కార్తీక్, జాఫర్, ప్రభు, జనార్ధన్, మోహన్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల జోనల్ ఇంచార్జ్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైమరీ స్థాయి నుండి హై స్కూల్, డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులు కష్టపడి చదవాలని అప్పుడే గ్రాడ్యుయేషన్ పట్టా పొందుతారని సూచించారు. చిన్నతనం నుండే కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అందుకు ఉదాహరణ ఈ చిన్నారులే అని ఆయన అన్నారు. గ్రాడ్యుయేషన్ పట్టాలను ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విజయకర్తన్, ప్రిన్సిపాల్ మీనాజ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నూతన సబ్ స్టేషన్‌ను మంజూరు చేయాలని మండలంలోని తిర్మన్ పల్లి ఎంపిటిసి చింతల దాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీణ్‌గౌడ్ విన్నవించుకుని సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు మంగళవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందల్వాయి మండల కేంద్రం తిర్మన్‌పల్లి గ్రామంలో ఉండటంతో మండల కేంద్రంలో ఉన్నందున వ్యాపార రిత్యా, గృహ నిర్మాణ రిత్యా విద్యుత్ ఉపయోగం చాలా వరకు పెరిగిందన్నారు. ప్రస్తుతం గృహావసరాలకు రాంపూర్ సబ్‌స్టేషన్ నుండి తిర్మన్‌పల్లి వ్యవసాయ రంగానికి, గన్నారం సబ్‌స్టేషన్‌నుండి బస్‌స్టాండ్ ప్రాంతానికి, గృహావసరాలకు ఇందల్వాయి సబ్‌స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఒకే గ్రామంలో మూడు సబ్ స్టేషన్లు నుండి విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు. ఈ రెండు సబ్ స్టేషన్‌లు దాదాపుగా మూడు నుండి నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్నాయని, రాంపూర్ సబ్ స్టేషన్ ద్వారా మూడు గ్రామాల నుండి మా గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఎక్కడైనా ఏమైనా ఘటనలు జరిగితే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఏగ్రామంలో సమస్య వచ్చిన గంటల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. తిర్మన్‌పల్లి హెడ్ క్వార్టర్ లో సబ్ స్టేషన్ నిర్మిస్తేవ్యవసాయ రంగానికి, వ్యాపారులకు గృహావసరాలకు లోవోల్టేజ్ సమస్య తీరుతుందని పేర్కొన్నారు. తిర్మన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ గుడి పక్కకు సర్వే నెంబరు 623/2/1 లో సబ్ స్టేషన్ మంజూరు చేయాలనిప విన్నవించారు. సబ్ స్టేషన్ మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గౌడ సంఘ సభ్యులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ, తదితరులు

ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలి

- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/మోర్తాడ్

ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. సురేష్, సిపిఐఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి కిషన్ అన్నారు. మోర్తాడ్ మండలంలోని దొనకల్, తిమ్మాపూర్, గాండ్లపేట్, మండలకేంద్రంలోని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వినతి పత్రాలను అందజేశారు. కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోనూ పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలం ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు కలిపి పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల వస్తువులను పంపిణీ చేయాలని, అదేవిధంగా వంటగ్యాస్ 50శాతం సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. నాణ్యమైన సన్నం బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోలు కలిపి పది కిలోల బియ్యం ఇవ్వాలన్నారు. ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ కట్టి ఇవ్వాలని, ఇళ్ల స్థలం ఉన్నవారికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి అశోక్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్యక్క, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా కమ్మర్ పల్లి మండల నాయకులు వి. బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సారాసురేష్

రంజాన్ దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన దుస్తులను మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక సభా స్థలిలో ముస్లిం సోదరి సోదరీమణులకు దుస్తులను పంపిణీ చేసినట్టు తహశీల్దార్ విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మ, జడ్పీటిసి సభ్యులు బద్దం నర్సవ్వల దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, అధికార పార్టీ మండల అధ్యక్షులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, కో అప్షన్ సభ్యులు, మైనార్టీ సోదరులు, రెవిన్యూ సిబ్బంది, అధికార పార్టీ కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలి

సర్పంచ్ పుప్పల గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ పుప్పాల గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని అమీర్ నగర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూర దృష్టితో తెలంగాణ రాష్ట్రంలో కంటి సమస్యలతో ఎవరు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పాల గంగాధర్ కంటి పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట జ్యోతి ప్రసాద్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు క్యాతం గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్, ఆశా వర్కర్లు, ఏఎంసీ ఎక్స్ చైర్మన్ సొసైటీ వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేందర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగం గంగారెడ్డి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్

నేడు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ విక్రమ్ మంగళవారంఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 10.30గంటలకు హాజరు కావాలని కోరారు. లబ్ధిదారులు రాకుంటే వారి చెక్కులను ఉన్నతాధికారులకు వెనక్కి పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, అధికార పార్టీ నాయకులు పాల్గొనాలని తెలిపారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు భవనం ప్రారంభం



మాట్లాడుతున్న చైర్మన్ శోభ

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని చైర్‌పర్సన్ శోభ, నిర్మల్ రిజినల్ మేనేజర్ మహివివేక్, బ్రాంచ్ మేనేజర్ సుధాం వివేక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు 427 శాఖలలో 25వేల కోట్లతో వ్యాపారం చేస్తుందని, భీంగల్ శాఖలో 51 కోట్లతో వ్యాపారం కొనసాగుతుందని తెలిపారు. బ్యాంకు సేవలు ప్రతి ఒక్కరూ వినయోగించుకోవాలని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు కోటి రూపాయల రుణాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఏపియం కుంట శ్రీనివాస్, సీసీలు పురస్తు నరేష్, మెప్మా సిబ్బంది, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు , మహిళ సంఘల సభ్యులు పాల్గొన్నారు

కొత్తపల్లిలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, సర్పంచ్ మారెల్లి విష్ణుతో కలిసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ప్రణవ రోగులకు వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామపద్మ మాట్లాడుతూ కంటి వెలుగును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి చూపు సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ కంటీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దాసరి శేఖర్, రాజేశ్వర్, డాక్టర్ ప్రణవ, హెల్త్ సూపర్ వైజర్ భీమన్న, మేరమ్మ, ఆరోగ్య శాఖ సిబ్బంది,వార్డ్ సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్ వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

రైతును ఆదుకునేందుకే కొనుగోలు కేంద్రాలు

- జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరులు

భీంగల్: రైతులను ఆదుకునేందుకే సీఎం కేసీఆర్ వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరను అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి అన్నారు. మండలంలోని మెండోరా, బాబాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను యంపిపి మహేష్, ఏపియం కుంట శ్రీనివాస్‌లో కలిసి ప్రారంబించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆయేషా, రాజేందర్, యంపిటీసిలు సుర్జీల్, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్, తుక్కాజీనాయక్, ఏఈఓ భార్గవ్ రైతులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లి: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో కమ్మర్‌పల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరి వరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పర అనిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారి మురళి, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి బద్దం రమేష్, నాయకులు సామ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

(వేల్పూర్)ఆర్మూర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి కోరారు. మండలంలోని పచ్చల నడుకుడ సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాల్లో వడ్ల కొనుగోలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ భారతి రాకేష్ చంద్ర, పార్టీ అధ్యక్షులు జైడి నాగేదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, కోర్ కమిటీ సభ్యులు సామ మహిపాల్, పచ్చల నడుకుడ సొసైటీ చైర్మన్ గడ్డం లింబారెడ్డి, వైస్ చైర్మన్ గుడాల పెద్ద రమేష్, పాలకవర్గ సభ్యులు పచ్చల నడుకుడ సర్పంచ్ శ్వేత గంగారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ నితీష్ కుమార్, వాడి సర్పంచ్ మహేష్ జానకంపేట్ సర్పంచ్ సొడ రమేష్, సాయిపేట్ సర్పంచ్ సుధాకర్ గౌడ్, పచ్చల నడుకుడ ఎంపీటీసీలు గుడాల గంగాధర్, నోముల గంగారెడ్డి, జానకంపేట్ ఎంపీటీసీ చందన్ వాడి ఎంపీటీసీ, రైతులు, వీడీసీ సభ్యులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ ఛైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం మద్దతు ధర గ్రేడ్-ఏకు రూ.2060 గ్రేడ్-బి కి 2040 నిర్ణయించిందని తెలిపారు. సంఘ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్లు సిగసారం గంగారాం, జి.కె శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, డీసీసీబీ డైరెక్టర్లు నాగంపేట్ శేఖర్, మోత్కు భూమన్న, ఏఎంసి చైర్మన్ గుణవీర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ ముక్కెర దేవన్న, రైతు బంధు సమితి మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య, రైతు బంధు సమితి జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, తహసీల్దార్ జనార్ధన్, ఏఓ అబ్దుల్ మాలిక్, సంఘాల డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మూడు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు విండో చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి తెలిపారు. పాలెం, తిమ్మాపూర్, వడ్యాట్ గ్రామాల్లోని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సంతోష్, చిన్నారెడ్డి, రూప రవీందర్, విండో ఉపాధ్యక్షుడు నవీన్, భూమన్న ఎంపీటీసీలు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్ : కొనుగోలు కేంద్రం ప్రారంభించిన వైస్‌చైర్మన్ రమేష్‌రెడ్డి



భీంగల్ : కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జడ్పీటీసీ



ఏర్గట్ల : తాళ్లరాంపూర్‌లో ప్రారంభం..



కమ్మర్‌పల్లి :ఉప్లూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విండో చైర్మన్



మోర్తాడ్ మండలంలో..

మూఢనమ్మకాలతో మోసపోవద్దు

తాడ్‌బిలోలిలో పోలీసుల కళాజాత

నవతెలంగాణ-రెంజల్

ప్రజలు మూఢనమ్మకాలతో మోసపోకూడదని రెంజల్ ఎస్ఐ పండ్గ సాయన్న తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని తాడుబిలోలి గ్రామంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై పోలీస్ కళాజాత నిర్వహించారు. అమాయక ప్రజలు ఏ విధంగా మోసపోతున్నారో పోలీసు కళాబృందం కండ్లకు కట్టినట్టు చూపించింది. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకూడదని ఆయన పేర్కొన్నారు. కంప్యూటర్ యుగంలోనూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఇప్పటికీ మోసపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుండైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరసయ్య, ఆలయ కమిటీ చైర్మన్ లింగాల అబ్బన్న, పార్వతీ రాజేశ్వర్, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జుక్కల్



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును వైస్ ఎంపీపీ ఉమాకాంత్ దేశాయి చేతుల మీదుగా అందించినట్టు బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు నీలుపటేల్ తెలిపారు. కార్యక్రమంలో విండో చైర్మెన్ శివానంద్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాదారావ్ దేశాయి, మాజీ అధ్యక్షుడు నీలుపటేల్, జుక్కల్ మాజీ సర్పంచ్ బొల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ కార్యాలయం ద్వారా బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కళ్ళు సాయిలు (50) అనే వ్యక్తి పశువుల ఆసుపత్రి దగ్గర మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత రెండు సంవత్సరాల నుంచి గ్రామంలో మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. మృతుడి సంబంధికులెవ్వరూ లేరు. దీనిపై పోలీసులను వివరణ కోరగా గ్రామానికి చెందిన వ్యక్తి మతిస్థిమితం లేక మృతి చెందాడని ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఏఎస్ఐ తెలిపారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నర్సరీల్లో ప్రతిరోజు మొక్కలకు నీళ్ల సరఫరా చేసి, వాటిని సంరక్షించాలని వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం, నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రాము మాట్లాడుతూ నర్సరీల్లో గ్రామానికి సరిపడా మొక్కలను పెంచుతున్నట్టు చెప్పారు. మొక్కలను రక్షించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. నర్సరీల్లోని మొక్కలు, రోడ్లు, వీధులకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిదీ అని అన్నారు. ఆయా గ్రామ నర్సరీల్లోని మొక్కలను రానున్న వానాకాలం నాటికి సిద్ధంగా ఉన్నాయని ఆయన అన్నారు. వీరి వెంట సర్పంచ్ యశోద మహేందర్, తదితరులు ఉన్నారు.

నేడు వికలాంగులకు బస్సు పాసులు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని వికలాంగులకు బస్సు పాసులను బుధవారం పంపిణీ చేస్తున్నట్టు ఏపీఎం రాజిరెడ్డి తెలిపారు. బస్సుపాస్‌కు వచ్చేటప్పుడు సదరన్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని అన్నారు. పాస్‌లు పంపిణీ చేయడానికి బస్సు డిపో నుంచి బాల్ రాజుగౌడ్ వస్తున్నట్టు తెలిపారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీవో గంగారాం

నవతెలంగాణ-ఎడపల్లి

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో గంగారాం అన్నారు. మంగళవారం మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామ శివారులో గల పంట పొలాల మధ్యన ఉన్న కాలువలో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ బండ మనోహర్, సీనియర్ ఉపాధి కూలీలు మదన్ తదితరులున్నారు.

ఎడపల్లి శ్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, స్థానిక సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ మాట్లాడారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎడపల్లిలోని శ్మశాన వాటిక వద్ద కావాలని కోరడంతో ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ఎమ్మెల్సీ సీడీపీ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ఎంపీటీసీలు షేక్ జావిద్ బాబా, నాయుడు స్రవంతి పోతన్న, గుంజేరి మనిషారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ మొద్దోల్ల సురేష్, మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాణిక్ ఎల్లయ్య యాదవ్, నాయకులు డల్ల సురేష్, మచ్చూరి గంగాధర్, బంజ శంకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని నెహ్రూనగర్, వకీల్‌ఫారం గ్రామాలకు చెందిన లబ్దిదారులకు బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్, యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్ రూమ్ బిల్లులు రూ.7,20,000 మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాని బాబు, జెడ్పీటీసీ హరిదాస్, సీనియర్ నాయకులు వీరరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిరి, గ్రామ అధ్యక్షుడు రాంబాబు, ఉప సర్పంచ్ శ్రీధర్, శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం

- జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-బిచ్కుంద



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించి కొనుగోలు చేస్తున్నదని రైతుల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని జుక్కల్ శాసనసభ్యులు అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. మంగళవారం బిచ్కుంద మండలంలోని వాజిద్‌నగర్, బండ రెంజల్, గుండెనెమలి, గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వాజిద్ నగర్ గ్రామంలో సర్పంచ్ తోట అనూయలక్ష్మీనారాయణ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం బండా రెంజల్ గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో రైతులు విత్తనం నాటిన నుండి అహర్నిశలు కష్టపడి పండించిన పంటలు అమ్ముకునే వరకు నానా కష్టాలు పడేవారని దళారులు తక్కువ ధరకే పంటలు కొనుగోలు చేయడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయే వారని, కొందరు దళారులు రైతులకు డబ్బులు ముంచేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం ద్వారా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన వరి ధాన్యాన్ని విక్రయించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీహరి రాజు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, పుల్కల్ పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటరావు దేశాయ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మొగలయ్య, ఉపసర్పంచ్ బద్రిసాయిలు, గంగారాం, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఏపీఎం నాగరాజు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను
- ప్రారంభించిన సర్పంచులు

నవతెలంగాణ-రెంజల్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా, సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్కే అహ్మద్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, స్థానిక నాయకులు కె.సాయిలు, డైరెక్టర్ సాయిలు, పీట్ల భూమేష్, జాడి సాయిలు తదితరులున్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులను ఆదుకుంటుందని సర్పంచి గౌరవజీ లలిత రాఘవేంద్ర, మండల ఉపాధ్యక్షులు క్యాతం యోగేష్ స్పష్టం చేశారు. మంగళవారం నీలా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గడ్డం స్వప్న, స్థానిక నాయకులు గఫర్, రామ్ చందర్, అక్తర్, శివకుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యలను పరిష్కరించాలి

- సమ్మె నోటీసు అందజేసిన వీవోఏలు

నవతెలంగాణ-రెంజల్/వర్ని



రెంజల్ : వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

వీవోఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీఎం చిన్నయ్య, ఎంపీడీవో శంకర్‌కు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా, డ్వాక్రా సంఘాలను ఆర్థిక, సామాజికంగా బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో బలోపేతం చేసిన తమను ఉద్యోగులుగా గుర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఏఓలకు కనీస గౌరవ వేతనం రూ.18వేలు ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, 30 మంది వీఏఓలు పాల్గొన్నారు.

వర్ని :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు వేతనాలను పెంచాలని పలు గ్రామాల వీవోఏలు ఏపీఎంలకు, ఎంపీడీవోలకు సమ్మె పత్రము మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ కే శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి/జుక్కల్



ఎడపల్లి : కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని జానకంపేట్, ధర్మారం గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచులు సాయిలు, గౌరీ పూజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దగ్గర దూరపు చూపుతో ఇబ్బందులు పడుతున్న 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలను తప్పకుండా చేయించుకోవాలని ఆయన కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఎడపల్లి కంటి వెలుగు ఇన్చార్జి రాజ్ కుమార్, ఆస్పత్రి పాలనాధికారి రాములు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్..

జుక్కల్ :

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రవిశంకర్ పటేల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిశంకర్ పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడతలో భాగంగా గ్రామాలలో కంటి వెలుగు పరీక్షలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ దుస్తుల పంపిణీ



దోమకొండ : రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ-దోమకొండ/రాజంపేట్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకుని రంజాన్ దుస్తులను 300 మంది నిరుపేద కుటుంబాలకు కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, ఎంపీపీ కనుగంటి శారద నాగరాజ్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు అన్నీ వర్గాల ప్రజలకు దుస్తులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ మండలాధ్యక్షులు గాండ్ర మధుసూదన్ రావు, సర్పంచ్ అంజలి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, మాజీసర్పంచ్ ఐరన్ నరసయ్య, సొసైటీ చైర్మన్ పన్యాల నాగరాజురెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షమీమ్, వార్డు సభ్యులు బొమ్మర శ్రీనివాస్, బుర్రి రవి, వరలక్ష్మి, చాముండేశ్వరి ఆలయ చైర్మన్, పాలకుర్తి శేఖర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం రంజాన్ పండుగ నేపథ్యంలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిక్కజి బల్వంత్ రావు మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ ఆముద సౌమ్య నాగరాజు, జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్, రైతు సమన్వయ సమితి జూకంటి మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శాంత, మండల కో ఆప్షన్ హైమద్ అలీ, సొసైటీ వైస్ చైర్మన్ అంద్యాల రమేష్, తలమడ్ల ఎంపీటీసీ నిర్మల రాజు, పొందుర్తి శివాయపల్లి ఎంపీటీసీ బాలరాజు గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల స్వామి, బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ మచ్చ భాస్కర్, రైతు గ్రామ సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీరామ్ సురేష్, సొసైటీ డైరెక్టర్ సాయిబాబా, రాజంపేట మాజీ ఎంపీటీసీ గుర్రాల రవి, నాయకులు ముస్లిం సోదరులు ఈర్షద్, అలీ, మహమ్మద్, అషు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట్‌లో..

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన



వారోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం గాంధారి మండల కేంద్రంలోని రైస్ గోదాములు, గ్యాస్ గోడౌన్, పెట్రోలు పంపు కరపత్రాలు పంపిణీ చేసి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శివాజీరావు, హరి, రవిరాజ్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పాలకవర్గం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మేజర్ గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలంలో పాలకవర్గం సభ్యులు ఆ స్థలం కబ్జాకు గురికాకుండా ఉండేందుకు మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ లింగంపేట్‌నకు సంబంధిందించిన జీపీ ఎల్‌పీ నెంబర్:167/89 ప్రకారం గ్రామపంచాయతీకి ఐదు శాతంగా నాలుగు ప్లాట్లు గతంలో కేటాయించడమైనది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో సీపీఐ పార్టీ మండల అధ్యక్షులు రాములు, కార్యదర్శి జయమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలలో తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరచడానికి ఇంటింటికి సీపీఐ జాతా కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో గోదావరి, గంగామణి, శకుంతల, అనిత, జయరాం, గౌతమి, దేవయాని, రమణి, అజమ్మ తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, దూపల్లి, గ్రామ పంచాయతీ ఆవరణలో నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడపడుచులకు ఆర్థికంగా సహాయాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని వారన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఆడబిడ్డలకు ఆర్థిక సాయం అందజేయడానికి సహకరించిన బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేషు గారి భూమారెడ్డి, ఎంపీటీసీ మొగులాబాయి, గ్రామ కార్యదర్శులు సిహెచ్ సాయి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానీపేట్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు జబ్బార్ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. జబ్బార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అందులో భాగంగానే సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు.

ఊటపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో సర్పంచ్ కృష్ణ గుప్త సీసీ రోడ్డు పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సహకారంతో ఉపాధిహామీ నిధుల ద్వారా మంజూరైన నిధుల నుంచి సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరి చేస్తూ గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వినోద్ నాయక్, దళిత సంఘ నాయకులు రాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీపేట్‌లో నలుగురికి కుక్క కాటు

ఒకరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-నవీపేట్



మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో మంగళవారం వీధి కుక్క కాటు వేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికరాలైన గంగా లక్ష్మికి కుక్క కాటు వేయడంతో భయాందోళనకు గురై పక్కనున్న రాయిపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. మరో ముగ్గురు ఆనంద్, మోహన్‌తోపాటు చిన్న బాబుకు సైతం కుక్క కరవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని పలుమార్లు గ్రామపంచాయతీకి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.

ముస్లింలకు తోఫాలు అందజేత

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు కేసీఆర్ తోఫాలను అందజేశారు.ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సంగీతారాజేందర్,జడ్పిటిసి మాన్ సింగ్ నాయక్, వైస్ ఎంపిపి తోట రాజన్న, మైనారిటీ మండల అధ్యక్షుడు గౌస్ బాషా, అబ్బాస్, లియాకత్ అలీ, ముషీర్, ఇమ్రాన్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

సానుకూలత రాకుంటే సమ్మేనే

- 27డిమాండ్లతో అధికారులకు

సమ్మె నోటీసులు అందజేత

నవతెలంగాణ-ధర్పల్లి



వినతిపత్రం అంఆదజేస్తున్న వీవోఏలు

తాము 15ఏండ్లుగా ప్రభుత్వాలకు చేయూత అందిస్తూ బాసటగా నిలుస్తున్నప్పటికీ ప్రభుత్వం తమకు ఇప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని మండల వీఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సమ్మె నిర్వహించనున్నామని వీఓఏల మండల అధ్యక్షుడు నయీమ్ తెలిపారు. మంగళవారం ఐకెపి వీఓఏలు సమావేశమై 27డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసుని ఎంపీడిఓ నటరాజ్, ఐకెపి ఏపీయం సునీత, మండల సమైక్య అధ్యక్షురాలు మద్నూర్ లావణ్యలకు నోటీసులు అందించారు. ప్రభుత్వం తమకు సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా గుర్తించడంతోపాటు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని తదితర 27డిమాండ్లతో సమ్మె నిర్వహించేందుకు పూనుకున్నట్లు అధికారులకు తెలిపారు. సోమవారం నాటికి ప్రభుత్వం సమస్యలపట్ల సానుకూల ప్రకటన చేయని యెడల సమ్మె నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజేశ్వర్, గంగాధర్, నిర్మల, మాలావత్ రమేష్ నాయక్, అలేఖ్య లక్ష్మణ్, వీఓఏలు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 20న ఉద్యోగమేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు సుస్థీరా ఇన్ఫ్రా ప్రాజెక్ట్ (Susthiraah infra Projects) హెూదా (Marketing Executive, Marketing Manager, Site Incharge/Telecaller) హైదరాబాద్ ప్రాంతంలో ఉద్యోగాలు కలవు అని తెలియజేసినారు. విద్యార్హత ఎస్ఎస్‌సి/ఇంటర్/డిగ్రీ/ఎంబీఏ/డిప్లమా ఆ పైన చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వయోపరిమితి 28సంవత్సరాల లోపు ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగ యువతి/యువకులు ఉద్యోగమేళాలో జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లాలో పాల్గొనాలని తెలిపారు. నిజామాబాద్ శివాజీ నగర్ ఐటిఐ క్యాంపస్ (I.T.I Campus) 6305743423, 9581768413, 9959456793, సంప్రదించాలని పేర్కొన్నారు. బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇఫ్తార్ కార్యక్రమం బుధవారం సాయంత్రం హస్మి మస్జీద్ ఖిల్లా రోడ్డులో నిర్వహించబడుతుందని మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దలు సుదర్శన్ రెడ్డి , మధు యాష్కీ గౌడ్, షబ్బీర్ అలీ, అజహరుద్దీన్ తెలంగాణ రాష్ట్ర వ్యహారాలు ఇంచార్జి సెక్రటరీ నదీమ్ జావీద్ ముఖ్య అతితులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మాజీ విప్ ఇరవత్రి అనిల్ , టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పాల్గొంటారని, పార్టీ సోదరులందరు పాల్గొనాలని కోరారు.

కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారు


- ఏఐఎస్ఎఫ్


నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్పొరేట్ విద్యా సంస్థలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తున్నారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు అన్నారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాలలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నుండి ఎటువంటి పర్మిషన్ లేకుండా అకాడమిక్ ఇయర్ ముందు నుండి అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా ఉంటున్నారంటే దాని అర్థం విద్యాశాఖ అధికారులకు కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యం దగ్గర నుండి ముడుపులు ముట్టుతున్నాయని అన్నారు. ఒక విద్యార్థి దగ్గర 30 వేల నుండి 70 వేల రూపాయలు వరకు ఫీజులు వసూలు చేస్తున్న దాంతో పాటు జీవో నెంబర్ ఒకటి ప్రకారం, ఎటువంటి నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థలు పెట్టడం అయినా విద్యాశాఖ అధికారులు దీనిపై స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్ నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల మీద విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల యజమాన్యల పైన క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే అనుమతులు లేని కార్పొరేటర్ విద్య సంస్థల పైన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమకార్యాచరణ తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ ప్రకటనలు ఆసరగా చేసుకున్న కోచింగ్ సెంటర్ల యజమాన్యం నిబంధనలను పాటించకుండా రెండు నెలల కోచింగ్‌కు 8వేల నుండి 12 వేల రూపాయలు వరకు ఫీజులు వసూలు చేయడం సరికాదని ఆయన అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్ల పైన వెంటనే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొవలని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి ,జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా కమిటీ సభ్యులు దినేష్, నగర సహాయ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా మాహానీయుల జయంతి వేడుకలు

బహుజన గాయకులు ఏపూరి సోమన్న





సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్

శివాజీ మహారాజ్ జయంతిని పున:పరిశీలించి ఏప్రిల్ 8న నిర్వహించాలని మహారాష్ట్ర చరిత్రకారులు మహారాష్ట్ర ప్రభుత్వానికి తుది తీర్మానం అందించారని బహుజన గాయకులు ముఖ్య అతిథి ఏపూరి సోమన్న తెలిపారు. సోమవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలని లో మహనీయుల సామూహిక జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా బామ్‌సేఫ్ రాష్ట్ర అధ్యక్షులు బట్టి చెన్నయ్య మాట్లాడుతూ.. ఓట్లు అమ్ముకోవడం నేరమని, ఓటకు నోటు ఇచ్చేవారిని పట్టుకుని ఎన్నికల కమిషన్‌కు పట్టిస్తామని తెలిపారు. ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగంలో ఉందని చెప్పారు. శివాజీమహారాజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, కాన్షీరాం జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బుద్ధిస్టు నాయకులు అశోక్ భాగ్యవాన్, ఎస్సి, ఎస్టీ, యూఎస్ రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, బంగారు సాయిలు, సిద్ధిరాములు, కొమ్మురాజమల్లు, టీఎస్ ఏవైఎస్ బ్రాంచ్ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికి సీపీఐని విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి అని సీపీఐ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ నగరంలో మే ఒకటో తేదీ నుండి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ బీజేపీ హటావో దేశ్‌కో బచావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవటంలో భాగంగా ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా మోడీ ప్రభుత్వం విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు చెల్లిస్తామని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతామని, హామీనిచ్చి ఈరోజు వాటిని మరిచారని అన్నారు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన లక్షలకోట్ల రూపాయలను కొంతమంది పెట్టబడుదారులు బ్యాంకుల దగ్గర తీసుకున్న వాటిని మాఫీ చేయడానికి వాడుతున్నారని, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని అన్నారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్ని చైతన్యం చేయడంతోపాటు రాబోయే కాలంలో ఉద్యమాన్ని సిద్ధం చేయటానికి ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వాటితోపాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యం చేయడంకోసం పార్టీ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు రఘురాం నాయక్, అనిల్, హనుమాన్లు, దేవేందర్, రంజిత్, కండ్ల కోయ గంగాధర్, సఖి సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల అవగాహనకు పరికరాలు ఎంతో అవసరం

- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి
- మండలంలోని 6 ప్రైమరీ పాఠశాలల్లో 120 రకాల సైన్స్ పరికరాల అందజేత

నవతెలంగాణ-ధర్పల్లి



మాట్లాడుతున్న ఎంపీపీ నల్లసారిక హన్మంత్‌రెడ్డి

విద్యఅనేది మన హక్కు అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, విద్యార్థులకు ప్రైమరీ దశనుండి పరికరాల ద్వారా నాణ్యమైన విద్య అందించినట్లైతే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎంపీపీ నల్లసారిక హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె ఎంపీపీ నిధుల నుండి మండలంలోని సితాయిపేట్, హెున్నజీపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లోని విద్యార్థులకు సైన్స్ పరికరాలను అందించారు. ఒక్కొక్క పాఠశాలకు 2 లక్షల నిధులతో 120 రకాల సైన్స్ పరికరాలను అందించారు. విద్యార్థులకు ప్రైమరీ దశనుండి సైన్స్‌పై అవగాహనా కల్పించినట్లయితే పైచదువుల్లో సునాయాసంగా రాణించగలుగు తారని అన్నారు. పాఠ్యాంశాలు బోధించే సందర్భంలో విద్యార్థులకు సంబంధిత పరికరాలను చూపిస్తూ విద్యను బోధించినప్పుడు విద్యర్థులు వాటిని సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మండలంలోని దుబ్బాక, డీబీతండా, రేకులపల్లి, ధర్పల్లి, సీతాయిపేట్, హెున్నజీపేట్ గ్రామాల్లోని ఆరు పాఠశాలలకు ఇలాంటి పరికరాలు అందించనున్నామని అన్నారు. దశలవారీగా అన్ని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. అనంతరం హెున్నజీపేట్ సర్పంచ్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ పాఠశాలకు సముచిత స్థానం కల్పించి సైన్స్ పరికరాలు అందించిన ఎంపీపీ సారికకు, ఎమ్మెల్యే, జెడ్పిటిసిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీతాయిపేట్ హెున్నాజీ పేట్ గ్రామాల సర్పంచులు భగవాన్‌రెడ్డి, లొక్కిడి విజయ రాములు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, గంగారెడ్డి, చంద్రునాయక్, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, ఎస్ఎంసి చైర్మన్ నీరడి నరేందర్, సత్యనారాయణ, ధారావత్ గోపాల్ నాయక్, శ్రీనివాస్ నాయక్, అరుగుల రాజేశ్వర్, సీనియర్ పాత్రికేయులు మంచికంటి నరేందర్, సొసైటీ చైర్మెన్ మ్యాడారం రాజేందర్ రెడ్డి, పోత రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మండల కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-సిరికొండ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు12 రకాల నిత్యావసర వస్తువులు, 10 కేజీల సన్న బియ్యం ఉచితంగా ఇవ్వాలని,, ఇల్లు లేని వారికి పది లక్షల రూపాయలు ఇల్లు నిర్మాణం కోసం ఇవ్వాలని, రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డు జారీ చేయాలని, నిరుద్యోగులకు జీవనభృతి పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు కోరారు. ఈ నెల 20న తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని చేపడుతున్నట్లు మండలంలోని రావుట్ల గ్రామంలో మంగళవారం ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) డివిజన్ అధ్యక్షురాలు మాజీ ఎంపీటీసీ పి.రమ మాట్లాడుతూ.... పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేయటానికి, వాళ్లకు లాభాలు చేకూర్చటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. పనిచేస్తున్నాయని అన్నారు. దేశంలో 30 శాతం మందికి, మూడు పూటలా తిండి దొరకటం లేదని ప్రభుత్వ సర్వేలు చెబుతుంటే. ఇంకోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థను తీసేసి నగదు బదిలీ పథకం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. హామీలు నెరవేర్చాలని నిర్వహించే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి ని జయప్రదం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో పిఓడబ్లు డివిజన్ కార్యదర్శి పుష్పలత, బి. మానస, ఈ.జమున, స్వరూప, సంగీత, తస్లీమ్ బేగం, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకులు బి. బాబన్న, సాయి రెడ్డి, ఈ. రమేష్,పివైఎల్ జిల్లా నాయకులు ఎండి.అనీష్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో 50శాతం గ్యాస్ సిలెండర్ సబ్సిడీ ఇవ్వాలి

- కొత్త రేషన్ కార్డులు అందజేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ధర్నా చేస్తున్న నాయకులు

రేషన్ షాపుల ద్వారా 50శాతం గ్యాస్ సిలెండర్లకు సబ్సిడీ ఇవ్వాలని, 12 రకాల సరుకులు ఇవ్వాలని, నూతన రేషన్ కార్డులను ఇవ్వాలని తదితర డిమాండ్లతో ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యు) ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో మంగళవారం డిచ్‌పల్లి తాహసిల్దార్ కార్యాలయం వద్ద దర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా (పిఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం బియ్యం మాత్రమే ఐదుకిలోలు పంపిణీ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఐదుకేజీలు కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు మొత్తం పది కేజీల నాణ్యమైన సన్న బియ్యం పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు వంట నూనె, కందిపప్పు, పెసరపప్పు, గోధుమపిండి, పంచదార, కారం, చింతపండు, ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ షాపుల ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సబ్సిడీ కూడా ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కార్పొరేటర్ల అనుకూల నిర్ణయమన్నారు. ఈ దేశాన్ని అప్పుల దేశంగా మార్చి పెద్ద కార్పొరేట్ వ్యక్తులకు అప్పచెప్పే విధంగా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఇదే పద్ధతి కొనసాగిస్తే త్వరలోనే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యూ పీవైఎల్ నాయకులు సుజాత, అనిత, సుల్తానా, శారద, మురళి, సాయాగౌడ్, మోహన్, శంకర్, శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు, పనిగంటల తగ్గింపుకోసం పోరాడుదాం

- ఐఎఫ్‌టీయూ



మాట్లాడుతున్న ఎంపీపీ నల్లసారిక హన్మంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కనీస వేతనాలు, పనిగంటల తగ్గింపుకై పోరాడుదామని ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం శ్రామిక భవన్ కోటగల్లిలో మంగళవారం నిర్వహించారు. రాబోతున్న 138వ మేడే సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మికుల కర్తవ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.సూర్యం మాట్లాడుతూ... ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచాయన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి పారిశ్రామిక హక్కుల చట్టాలను తీసుకొస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నదన్నారు. అన్ని రంగాల కార్మికులకు శాస్త్రీయంగా వేతనాల నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. 24 గంటలు దుకాణాలు తెరుచుకోవచ్చన్న కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది కార్మికులను మరింత శ్రమదోపిడికి గురి చేయడమేనన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ... నిజ జీవితాలకు సరిపడా కనీస వేతనాలు, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపుకై పోరాడుదామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్ అమలు నిలిపివేతకై పోరాడుదామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను తిప్పికోడదమన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్‌కు ఉద్యమించాలన్నారు. విద్యుత్ ఆర్టిజెన్స్‌కు సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శి బీ.మల్లేష్, జిల్లా కోశాధికారి రవి జిల్లా నాయకులు కిషన్, సత్యక్క, లక్ష్మణ్, మురళి, సాయరెడ్డి, విటల్, కిరణ్, లక్ష్మి, అనిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గాన్ని కలిసిన టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గం

- అభినందించిన రాష్ట్ర కమిటీ




సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎన్‌జీవో నిజామాబాద్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర, జిల్లా కార్యవర్గం ఎన్నికల రాష్ట్రధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్‌ను ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో నూతన జిల్లాధ్యక్షులు అలుక కిషన్ అధ్యక్షతన హైదరాబాద్ టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వంకాగా కలిసి ఘనంగా సన్మానించారు. నూతన కూర్పు పత్రాలను అందజేశారు. వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అలుక కిషన్ నాలుగోసారి ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్ష పదవి చేపట్టగా ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ కతజ్ఞతలు తెలియజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన టిఎన్జీవో అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్‌ను కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, మాజీ కార్యదర్శి సంఘం అమత్ కుమార్, సహాధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, నాగరాజు, గంధం వెంకటేశ్వర్లు, గంగా కిషన్, సత్యం, కాసాలి శ్రీనివాస్, పోల శ్రీనివాస్ , మాణిక్యం, ఉమా కిరణ్, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పేదల సంక్షేమంకోసం పనిచేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయం ఆవరణలో తోటి పార్టీ కార్యకర్తలతో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని వెంచిర్యాల, రెంజర్ల గ్రామాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో-అప్షన్ సభ్యులు మునిరొద్దీన్, ఆయా గ్రామాల సర్పంచులు ఆకుల రాజేశ్వర్, మట్ట సందీప్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బ్రహ్మదండి లింగం, విఘ్నేష్ గౌడ్, పుట్టి ప్రదీప్, గద్దల సాయిలు, చిన్న బాల్ రాజ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

20న విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 132/33 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుండి 10 వరకు మున్సిపల్, అంకాపూర్ గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంని ఏడీఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.